www.siddipetpower.com

# సిద్ధిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 131 | హైదరాబాద్ | గురువారం | 04-09-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## పార్టీలో ఉన్నప్పుడు వాళ్ల అక్రమాలపై ఎందుకు చర్యలు తీసుకోలేదు?

హైదరాబాద్ సెప్టెంబర్ 03 (సిద్దిపేట పవర్):

రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు కుమ్మక్కయ్యారని తాను గతంలోనే చెప్పానని భాజపా ఎంపీ రఘునందన్ రావు అన్నారు. నేడు ప్రెస్‌మీట్‌లో కవిత కొత్తగా చెప్పింది ఏం లేదని పేర్కొన్నారు. వాళ్ల పార్టీ వ్యవహారాల గురించి మాట్లాడదల్చుకోలేదని తెలిపారు. కవిత చెప్పిన మోకిల ప్రాజెక్టు అవకతవకల గురించి విచారించాలని చెప్పారు. పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, నవీన్‌రావు చేసిన అక్రమాలపై విచారణ జరపాలన్నారు.

‘‘జడ్పీ అధ్యక్షుడిగా నన్ను ఎవరు ఓడించారో గతంలో కేసీఆర్‌కు చెప్పాను. ఆరోజు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మెదక్ ఎంపీ ఎన్నికల్లో ఇబ్బందిపెట్టాలని చూసినట్లు గతంలోనే చెప్పా. కవిత ఇంకా వేరే విషయాలు కూడా మాట్లాడితే బాగుండేది. ఆమె మాటలతో భారత రాష్ట్ర సమితి అవినీతి పునాదుల మీద విస్తరించబడిందని తేలింది. మళ్లీ వచ్చే ఎపిసోడ్‌లో భారత రాష్ట్ర సమితి పెద్దలు చేసిన అవినీతిని బయటపెడితే బాగుంటుంది. పోచంపల్లి



శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రావు చేసిన అక్రమాల మీద మీరు పార్టీలో, ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదు'' అని రఘునందన్‌రావు కవితను ప్రశ్నించారు.

# హరీష్ రావు ట్రబుల్ షూటర్ కాదు.. బబుల్ షూటర్!

**రేవంత్ కు హరీశ్ లొంగిపోయారన్న కవిత**

**నాశనం చేయడమే హరీశ్ పని అని మండిపాటు**

**కేసీఆర్, కేటీఆర్ లను దెబ్బతీస్తున్నారని వ్యాఖ్య**

**సంతోష్ రావు వల్ల బీఆర్ఎస్ కు చెడ్డ పేరు వచ్చిందన్న కవిత**

**హరీశ్ బబుల్ షూటర్ అని ఎద్దేవా**

హైదరాబాద్ సెప్టెంబర్ 03 (సిద్దిపేట పవర్):

బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెన్షన్ కు గురైన కేసీఆర్ తనయ కవిత సంచలన ప్రకటన చేశారు. ఎమ్మెల్సీ పదవికి, బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ఆమె ప్రకటించారు. హైదరాబాద్ లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈ మేరకు తన నిర్ణయాన్ని వెలువరించారు. తన రాజీనామా లేఖలను మీడియా ముఖంగా చూపించారు.ఇదే సమయంలో మాజీ మంత్రి హరీశ్ రావుపై ఆమె నిప్పులు చెరిగారు. హరీశ్ రావు సీఎం రేవంత్ రెడ్డికి లొంగిపోయారని ఆరోపించారు. రేవంత్, హరీశ్ ఇద్దరూ ఒకే విమానంలో ఢిల్లీకి వెళ్లారని... ఆ ప్రయాణంలో రేవంత్ కాళ్లను హరీశ్ పట్టుకున్నారని చెప్పారు. ఆ ప్రయాణం తర్వాత హరీశ్ పూర్తిగా మారిపోయారని... రేవంత్ కు లొంగిపోయారని, ఆ తర్వాతే కుట్రలకు తెరలేచిందని తెలిపారు. నాశనం చేయడమే హరీశ్ రావు పని అని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్ లను దెబ్బతీసి పార్టీని చేజిక్కించుకునే కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు.

సంతోష్‌రావు చేసిన పనుల వల్ల బీఆర్ఎస్ కు చెడ్డ పేరు వచ్చిందని కవిత అన్నారు. కూరలో ఉప్పు, చెప్పులో రాయి వంటి వాడు సంతోష్ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ట్రబుల్ షూటర్ కాదని... బబుల్ షూటర్ అని విమర్శించారు. ఆయనే సమస్యను సృష్టించి, ఆ సమస్యను ఆయనే పరిష్కరించినట్టు బిల్డప్ ఇస్తారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి కూడా ఎప్పుడూ కేసీఆర్, కేటీఆర్ లనే టార్గెట్ చేస్తారని... హరీశ్ రావును ఒక్క మాట కూడా అనరని అన్నారు.



## కవితను విమర్శిస్తే నష్టపోతారు

**కవిత ఎపిసోడ్ మొత్తం కేసీఆర్ కుటుంబం ఆడుతున్న డ్రామా అన్న సీతక్క**

**కాళేశ్వరం అవినీతి నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ ఎత్తుగడ అని విమర్శ**

**అక్రమ సంపాదన పంపకాల్లో తేడాలతోనే కుటుంబ సభ్యుల మధ్య విభేదాలు అని వ్యాఖ్య**



హైదరాబాద్ సెప్టెంబర్ 03 (సిద్దిపేట పవర్): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యవహారం మొత్తం ఒక పెద్ద కుటుంబ డ్రామా అని... కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ నాటకాలు ఆడుతున్నారని మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. కవిత తన కుటుంబ సభ్యులపై చేసిన ఆరోపణల వెనుక పెద్ద కుట్ర ఉందని, అవినీతి సొమ్ము పంపకాల్లో వచ్చిన తేడాల వల్లే వారి మధ్య గొడవలు జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. ఈరోజు మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ సందర్భంగా సీతక్క ఈ వ్యాఖ్యలు చేశారు.

తెలంగాణ జాతిపితగా చెప్పుకునే కేసీఆర్, తన ఇంట్లోని నలుగురు కుటుంబ సభ్యులను కూర్చోబెట్టి సమస్యను పరిష్కరించుకోలేని బలహీన స్థితిలో ఉన్నారా? అని సీతక్క ప్రశ్నించారు. కాళేశ్వరం అవినీతి బండారం బయటపడేసరికి, కుటుంబ సభ్యుల మధ్య గొడవలు సృష్టించి అసలు విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అక్రమ సంపాదన, అవినీతి డబ్బు పంచుకోవడంలో వచ్చిన విభేదాలే ఈ డ్రామాకు కారణమని ఆమె అన్నారు.

ఈ సందర్భంగా ములుగులో తన ఓటమి విషయాన్ని కూడా సీతక్క ప్రస్తావించారు. "సంతోష్‌రావుకు బినామీ అయిన పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వేల కోట్లు సంపాదించారని కవితే స్వయంగా ఆరోపించారు. అదే పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, గత ఎన్నికల్లో ములుగులో నన్ను ఓడించడానికి వందల కోట్లు ఖర్చు పెట్టాడు. కవిత చేసిన ఈ బినామీ ఆస్తుల ఆరోపణలపై బీఆర్ఎస్ ఎందుకు స్పందించడం లేదు?" అని ఆమె నిలదీశారు.

# ఎన్నికల ముందు హామీల జాతర.. ఎన్నికల తర్వాత చెప్పుల జాతర

### ఏ వర్గం ప్రజలు కూడా ఈ ప్రభుత్వ పాలనపై సంతృప్తిగా లేరు

**ప్రభుత్వం ఏర్పడి 21 నెలలు దాటింది**

**పదేళ్లపాటు బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చెప్పుకోలేకపోయింది**

**అసెంబ్లీ ఎన్నికల్లో ఓవర్ కాన్ఫిడెన్స్‌కు పోయాం. కేటీఆర్**



హైదరాబాద్ సెప్టెంబర్ 03 (సిద్దిపేట పవర్):

సిద్దిపేటలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ప్రెస్‌మీట్ నిర్వహించి పలు అంశాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. సింగరేణి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడాన్ని ఆశ్చర్యకరంగా పేర్కొన్న ఆయన, పార్టీ ఇచ్చిన 10 హామీల్లో 8 నెరవేర్చినా ప్రజలు విశ్వాసం చూపలేదని అన్నారు. కాంగ్రెస్ 22 నెలల పాలనలో ఎవ్వరూ సంతోషంగా లేరని, ముఖ్యంగా రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని విమర్శించారు. ఎన్నికల ముందు హామీల జాతర పెట్టిన కాంగ్రెస్, ఎన్నికల తర్వాత మాత్రం చెప్పుల జాతర మిగిల్చిందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. “ఆనాటి రోజులు తిరిగి తెస్తానని రేవంత్ నిజమే చెప్పాడు... కానీ చెప్పి మరీ నిజాయితీగా మోసం చేశాడు” అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓవర్ కాన్ఫిడెన్స్ కారణంగానే వెనుకబడ్డామని అంగీకరించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు విషయమై కేటీఆర్ విపులంగా వివరించారు. గోదావరి జలాలు సమృద్ధిగా దొరికే మెడిగడ్డలో ఈ ప్రాజెక్టును నిర్మించామని, 21 పంప్ హౌస్‌లు, 19 సబ్‌స్టేషన్లు, 15 రిజర్వాయర్లు, వందల కిలోమీటర్ల సొరంగాలు, వేల కిలోమీటర్ల గ్రావిటీ కాల్వలతో ప్రపంచంలోనే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా కాళేశ్వరం నిలిచిందని అన్నారు. ఇలాంటి ప్రాజెక్టు కట్టినా కేసీఆర్‌పై సీబీఐ విచారణ పెట్టడం ఆశ్చర్యమని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో కరోనా సమయంలో కూడా ఆదాయం సున్నా అయినా సంక్షేమ పథకాలు ఆగలేదని కేటీఆర్ గుర్తు చేశారు.

కాంగ్రెస్ నాయకులు మాత్రం ఢిల్లీకి మూటలు మోయడమే పని చేసుకుంటున్నారని విమర్శించారు. కేంద్రం తెలంగాణ అప్పులు మూడు లక్షల కోట్లకు పైగా ఉన్నాయంటూ అబద్ధాలు చెబుతోందని, వాస్తవానికి బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 10, 11 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. తెలంగాణపై కేసీఆర్‌కి ఉన్న ప్రేమ కాంగ్రెస్, బీజేపీలకు ఎప్పటికీ ఉండదని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలను “దండుపాళ్యం బ్యాచ్”గా అభివర్ణించిన ఆయన, “మన దగ్గర ఉన్న బంగారాన్ని ఎత్తుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు” అని ఆరోపించారు.

**కాంగ్రెస్‌ది దండుపాళ్యం బ్యాచ్..**

కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది ఎత్తుకుపోయే బ్యాచ్ తప్ప ఇచ్చే బ్యాచ్ కాదని కేటీఆర్ విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత ఊకంటి ప్రభాకర్ రావుతో పాటు 300 మంది కార్యకర్తలు కేటీఆర్ సమక్షంలో చేరారు.

దమ్మున్న నాయకుడు ఉంటే దమ్మిడి లేకున్నా సంక్షేమ పథకాలు ఆగవు. చిత్తశుద్ధి గల్ల ప్రభుత్వం ఉంటే పనులు చేస్తది తప్ప సాకులు వెతకదు. ఈ సన్నాసులకు ప్రభుత్వం నడపడం చేతకాదు. ఎంతసేపు ఢిల్లీకి మూటలు పంపడం.. పదవులు కాపాడుకోవాలనే సోయి తప్ప ఇంకోటి లేదు. చివరకు కేసీఆర్‌ను తిట్టాలి అదే వారి పని అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

బీజేపీ ఎంపీ రఘునందన్ రావు పార్లమెంట్‌లో తెలంగాణలో అప్పులు ఎంత అని ప్రశ్న వేసిండు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పు, వదిలిపెట్టిపోయిన అప్పు మూడున్నర లక్షల కోట్లు అని కేంద్రం చెప్పింది. అందులో కేసీఆర్ రాకంటే ముందు 72 వేల కోట్ల అప్పు ఉంది. ఆయన వచ్చిన తర్వాత 2 లక్షల 80 వేల కోట్ల అప్పు చేసిండు. ఇది మాత్రమే అప్పు అంటూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో స్పష్టంగా చెప్పింది. అయినా కాంగ్రెస్ నేతలకు సిగ్గులేదు. ఒకడు ఆరు లక్షలు అంటడు.. ఇంకొకడు ఏడు లక్షలు అంటడు. ఇంకోడు ఎనిమిది లక్షలు.. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్నాడు.. ఆధారం, ప్రామాణికం, పత్రం అడిగితే లేదంటరు. ఉపన్యాసాలు అదరగొట్టాలి.. మీడియా మేనేజ్‌మెంట్ చేసుకోవాలి.. ఇదే కాంగ్రెస్ నేతల పని. వారి మీదికి దృష్టికి రాకుండా.. డైవర్షన్ గేమ్ ఆడుతున్నారు. కాళేశ్వరం, ఫార్ములా రేస్, విద్యుత్ అంశాల మీద సొల్లు పురాణం తప్ప ప్రజలకు పనికొచ్చే పని చేయలేదు అని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

## సీఆర్‌పై చర్యలు తీసుకోకుండా.. సీబీఐ విచారణకు ఎందుకు ఇచ్చినట్టు!

**బీజేపీపై బట్ట కాల్చి మీద వేసేందుకు సీబీఐకి కేసు**

**సీబీఐకి ఈ ప్రభుత్వం సహకరిస్తుందన్న నమ్మకం లేదు**

**బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే అనే చెప్పేందుకు ఇదంతా**

హైదరాబాద్ సెప్టెంబర్ 03 (సిద్దిపేట పవర్):

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో మాజీ సీఎం కేసీఆర్‌పై చర్యలు తీసుకోకుండా.. సీబీఐ విచారణకు ఎందుకు ఇచ్చినట్టు అని ప్రభుత్వంను ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. సీబీఐ మీద నమ్మకం లేదన్న కాంగ్రెస్.. ఇప్పుడు ఎందుకు ఇచ్చినట్టు అని విమర్శించారు. బీజేపీపై బట్ట కాల్చి మీద వేసేందుకు సీబీఐకి కేసు అప్పగించారని.. సీబీఐకి ఈ ప్రభుత్వం సహకరిస్తుందన్న నమ్మకం తనకు లేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే అనే చెప్పేందుకు.. ఇదంతా ఒక పన్నాగం అని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను కాపాడేందుకే కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోందని, 20 నెలల కింద ఈ నిర్ణయం తీసుకుంటే బాగుండేదని డీకే అరుణ చెప్పారు.

’20 నెలల కింద ఈ నిర్ణయం తీసుకుంటే బాగుండేది. బీజేపీ పైన బురద జల్లేందుకే ఈ సీబీఐ విచారణ. బీఆర్ఎస్‌ను కాపాడేందుకే కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోంది. బీఆర్ఎస్ నేతలను కాపాడేందుకే కాంగ్రెస్ చిత్తశుద్ధితో పని చేస్తుంది. కేసీఆర్‌పై చర్యలు తీసుకోకుండా సీబీఐ విచారణకు ఎందుకు ఇచ్చినట్టు. మేము అధికారంలో అవినీతి సొమ్మును కక్కిస్తామని అన్నారు. కానీ వారిని కాపాడడంలోనే బిజీగా ఉన్నారు. సీబీఐ మీద నమ్మకం లేదన్న కాంగ్రెస్.. సీబీఐకి ఎందుకు ఇచ్చినట్టు. బీజేపీపై బట్ట కాల్చి మీద వేసేందుకు సీబీఐకి ఇచ్చారు. సీబీఐకి ఈ ప్రభుత్వం సహకరిస్తుందని నమ్మకం లేదు. సాక్ష్యాలు ఇవ్వరు.. మాయం చేస్తారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే అనే చెప్పేందుకు ఇదంతా ఒక పన్నాగం. బీఆర్ఎస్ హైడ్రామా ఆడుతుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటే. కేసీఆర్ లేకుంటే కవిత ఎవరు’ అని ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు.

‘కేసీఆర్ వారసత్వం పోరాటం.. ఒకరి పైన ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. కేసీఆర్ సపోర్ట్ లేకుండా కాళేశ్వరంలో ఏదైనా జరిగిందా?. అవినీతికి బాధ్యత ఆ కుటుంబంలోని అందరిదే. లిక్కర్ కేసులో కవిత కూడా జైలుకు పోయి వచ్చింది. గద్వాలలో అభివృద్ధి కుంటుపడింది. అక్కడ ప్రజా ప్రతినిధికి ఎలాంటి సంబంధం లేదు. మెడికల్ కాలేజీలో మా ప్రయత్నం కూడా ఉంది. ఈ విషయంపై చర్చకు సిద్ధం. రాజకీయ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో.. ఇదంటే ఆయనకు కోపం వస్తుంది. చేతకాని వాళ్ళు చాలా మాట్లాడుతారు. ఆయన చేతనయ్యి గెలవలేదు.. చావు తప్పి లొట్టపోయి గెలిచారు. మహబూబ్ నగర్ నా సొంత జిల్లా. నేను ఎక్కడో పోయి పోటీ పడలేదు. మా ఇంట్లో నుండే ఆయనకి రాజకీయ జీవితం.. మేము లేకపోతే అయన ఎక్కడ. కొమ్ములొచ్చి చాలా మాట్లాడుతున్నారు’ అని డీకే అరుణ ఫైర్ అయ్యారు.



## బీఆర్ఎస్ పార్టీకి కవిత రాజీనామా చేయడంపై స్పందించిన బండి సంజయ్

**కవిత బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తే ఏమిటని వ్యాఖ్య**

**కాళేశ్వరం అవినీతి నుండి దృష్టి మరల్చేందుకు కవిత అంశం వచ్చిందన్న సంజయ్**

**ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఎందుకు అప్పగించడం లేదని ప్రశ్న**

హైదరాబాద్ సెప్టెంబర్ 03 (సిద్దిపేట పవర్):

బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి కల్వకుంట్ల కవిత రాజీనామా చేయడంపై కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ స్పందించారు. ఆమె బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినంత మాత్రాన ఒరిగేదేమీ లేదని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి కవిత అంశాన్ని తెరపైకి తీసుకువచ్చారని ఆయన ఆరోపించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు, గొర్రెల పంపిణీ, బర్రెల కొనుగోలు కుంభకోణాలపై సమగ్ర చర్చ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరం అవినీతిపై ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ నివేదికలు వచ్చిన తరువాత కూడా ప్రభుత్వం కాలయాపన చేసిందని, ఇప్పుడు సీబీఐకి అప్పగిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం, ఫోన్ ట్యాపింగ్ కేసును ఎందుకు అప్పగించడం లేదని ఆయన ప్రశ్నించారు.



# మీ గొడవల్లోకి నన్ను లాగొద్దు

**హరీశ్ వెనుక రేవంత్ ఉన్నారన్న కవిత**

**ప్రతిపక్ష కుటుంబ పంచాయతీలలో మాకు ఆసక్తి లేదు**

**నాలుగు కోట్ల ప్రజల వెంట నేను ఉన్నాను..**

**బీఆర్ఎస్ మునిగిపోతున్న నావ అని వ్యాఖ్య**

**కాలం చెల్లిన వెయ్యి రూపాయల నోటు లాంటి పార్టీ : సీఎం రేవంత్**



హైదరాబాద్ సెప్టెంబర్ 03 (సిద్దిపేట పవర్):

తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం మరింత వేడెక్కుతోంది. సీఎం రేవంత్ రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రతిపక్షంపై తీవ్రంగా విమర్శలు గుప్పించిన ఆయన, “చేసిన పాపాలు ఎప్పటికీ వెంటాడుతూనే ఉంటాయి. అవి ఎక్కడికీ పోవు” అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు.

“నవ్వుతూ కత్తులు పెట్టుకొని కౌగిలించుకుంటున్నారు. కానీ చేసిన పాపాలు ఊరికే పోవు. తప్పకుండా అనుభవించాల్సిందే. చేసిన పాపాలు వెంటాడుతూనే ఉంటాయి” అని రేవంత్ వ్యాఖ్యానించారు. అంతేకాకుండా ప్రతిపక్ష నేతల మధ్య జరుగుతున్న అంతర్గత గొడవలపై కూడా ఆయన స్పందించారు. “మీ పంపకాలలో వచ్చిన పంచాయతీ మీరు పూడ్చుకోవాలి. మీ కుటుంబంలో, మీ వర్గంలో ఒకరినొకరు కత్తులతో పొడుచుకుంటున్నారు. ఆ విషయాల్లో మమ్మల్ని లాగకండి. మా ప్రభుత్వానికి, నాకు ఎలాంటి ఆసక్తి లేదు” అని స్పష్టం చేశారు.

ప్రతిపక్షాల వెనుక తాము ఉన్నారన్న ఆరోపణలపై కూడా సీఎం స్పందించారు. “హరీష్ రావు, సంతోష్ వెనుక రేవంత్ ఉన్నాడు అంటారు... మరొకరు కవిత వెనుక ఉన్నాడని అంటారు. నిజానికి నేను నాయకుణ్ణి. నేనుంటే ముందుంటా. మా వాళ్లకు తోడుంటా. అంత చెత్త గళ్ళ వెనుక నేను ఎందుకు ఉండాలి? నాలుగు కోట్ల ప్రజల వెంట నేను ఉన్నాను, వారికోసం పని చేస్తాను” అని చెప్పారు. ప్రతిపక్షాలపై మరోసారి కఠినంగా విమర్శలు చేస్తూ, “మిమ్మల్ని ప్రజలు ఎప్పుడో తిరస్కరించారు. మీ పార్టీ కాలం చెల్లిన వెయ్యి రూపాయల నోటు లాంటిది. కాలగర్భంలో కలిసిపోతున్న పార్టీ” అని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు.

## కేసీఆర్‌కు పార్టీయే ముఖ్యం.. కూతురు కాదు

**కవిత సస్పెన్షన్‌ను సమర్థించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి**

**కేసీఆర్‌కు కుటుంబం కన్నా పార్టీయే ముఖ్యమన్న మాజీ మంత్రి**

**ప్రతి కుటుంబంలో గొడవలు సహజమని వ్యాఖ్య**

**కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని మండిపాటు**

**కేసీఆర్ లాంటి నేత ఉండటం తెలంగాణ అదృష్టమన్న మల్లారెడ్డి**



హైదరాబాద్ సెప్టెంబర్ 03 (సిద్దిపేట పవర్):

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు తన కుమార్తె, కుమారుడి కంటే పార్టీయే ముఖ్యమని, అందుకే పార్టీని ధిక్కరించిన ఎమ్మెల్సీ కవితపై వేటు వేయడం సరైన నిర్ణయమని ఆ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు. పార్టీ క్రమశిక్షణ విషయంలో కేసీఆర్ ఎంత కఠినంగా ఉంటారో ఈ చర్యతో మరోసారి స్పష్టమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

బోయిన్‌పల్లిలోని శ్రీవెంకటేశ్వర లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వినాయక చవితి పూజా కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కవిత సస్పెన్షన్‌పై స్పందిస్తూ, "ప్రతి కుటుంబంలో గొడవలు రావడం సహజం. అలాగే దేశంలోని ప్రతి పార్టీలో ఇలాంటి సస్పెన్షన్లు జరుగుతుంటాయి. కేసీఆర్‌కు తెలంగాణ ప్రజల శ్రేయస్సే ముఖ్యం. తన కుటుంబ సభ్యుల కోసం ఆయన పార్టీని నాశనం చేసుకోలేరు" అని అన్నారు. ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కాళేశ్వరం అంశంలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కాంగ్రెస్ డ్రామాలకు తెరలేపిందని మండిపడ్డారు. "ఈ విషయంలో సీబీఐ కాదు, ఎవరు వచ్చినా ఏమీ చేయలేరు. కేవలం సీబీఐ పేరు చెప్పి కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని చూడటం సరికాదు. ఆయన లాంటి గొప్ప నాయకుడు తెలంగాణకు దొరకడం మన అదృష్టం" అని మల్లారెడ్డి పేర్కొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయుడిగా మరాఠీ సంతోష్

**చేర్యాల, సెప్టెంబర్ 3 (సిద్ధిపేట పవర్)** ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు 2025 మండల విద్యాశాఖ చేర్యాల సిద్దిపేట జిల్లా లో జరిగిన కార్యక్రమంలో మండలంలో 24 మంది ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాసరెడ్డి , ఎం.ఈ.వో రచ్చ కిష్టయ్య లు మండల ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డును ప్రధానం చేసి సన్మానించారు. ఇందులో భాగంగా ఎంపీపీఎస్ శభాష్ గూడెం ప్రధానోపాధ్యాయులు మరాఠీ సంతోష్ కి మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రధానం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ ఈ అవార్డు నా పై మరింత బాధ్యత ను పెంచుతుంది అని, పిల్లల భవిష్యత్తు కోసం ఇంకా ఆనందంగా అద్భుతంగా పని చేస్తానని తెలిపారు.. నాకు ఈ అవార్డు రావడానికి కారణమైన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు అని సంతోష్ తెలిపారు..సంతోష్ కి శభాష్‌గూడెం గ్రామ ప్రజలు, పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు..



# కార్మికులు జీతాలు లేక పస్తులు

**గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా**

**నంగునూరు సెప్టెంబర్ 3 ( సిద్దిపేట పవర్ )**నంగునూరు మండలంలో బుధవారం రోజు గ్రామపంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు అందులో భాగంగా నంగునూరు మండల గ్రామపంచాయతీ కార్మికుల మండల అధ్యక్షులు దేవులపల్లి రాజమౌళి, జిల్లా కోశాధికారి చిట్యాల కనకయ్య మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు లేక పస్తులుండే కాలం వచ్చింది ప్రభుత్వం వెంబడే కార్మికుల ఆవేదన తెలుసుకొని వారికి రావలసిన రెండు మూడు నెలల జీతాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. 51 జీవో నీ సవరిస్తూ మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తూ 60 జీవోను అమలు చేయాలని కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈఎస్ఐ, పిఎఫ్ ను వర్తింపజేసేలా ప్రభుత్వ ఉద్యోగులాగా ప్రతి నెల జీతాలు ఒకటో తారీకు నాడు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు జీడి కంటి కనకవ్వ, బిల్లం బాలయ్య, దేవులపల్లి రేణుక, రామస్వామి, బెల్లం శీను తదితరులు పాల్గొన్నారు అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కి కార్మికుల డిమాండ్ల మెమోరండం ఇవ్వడం జరిగింది





# గజ్వేల్ పట్టణంలో ఎం అండ్ టీ ఫ్యాషన్ బట్టల షాపు ప్రారంభం

- **యువత వ్యాపార రంగంలో అభివృద్ధి చెందాలి**
- **ప్రోపరేటర్ చింత మణి**
- **గజ్వేల్ కాంస్టెన్సీ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె సమీర్ ఇషత్**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం** :గజ్వేల్ పట్టణంలోని ముట్రాజ్ పల్లి రోడ్డు లోని సాయిబాబా కమాన్ ఎదురుగా ఎం అండ్ టి ఫ్యాషన్ బట్టల షాపు ప్రోపరేటర్ చింత మని ఆధ్వర్యంలో స్వామి సమర్థ మహారాజ్ ఆశీస్సులతో ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలో ఇదివరకు ఉన్నటువంటి షాపుల లాగా కాకుండా కొరియర్ స్టైల్ లో యువతను ఆకట్టుకునే విధంగా రీజినేబుల్ ధరలకు ప్రీమియం షర్ట్స్ ప్రీమియం జీన్స్ కూడా ఉన్నాయని, గజ్వేల్ పట్టణ పరిసర ప్రాంత యువత గాని ప్రజలు ఒకసారి ఎం అండ్ టి ఫ్యాషన్ షాప్ ను సందర్శించాలని అన్నారు. అదేవిధంగా తమ వద్ద పెళ్లిలకు గాని పండుగలకు గాని క్రాఫ్ బట్టలు కూడా ఉన్నాయని అన్నారు. అదేవిధంగా యువత స్వయంకృషితో ఎదగాలని వ్యాపారంగంలో యువత మరింత అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చింత పద్మ గజ్వేల్ కానిస్టెన్సీ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె సమీర్ ఇషత్ కుటుంబ సభ్యులు స్నేహితులు పాల్గొన్నారు.




# దుబ్బాకలో వికలాంగుల, చేయూత పెన్షన్ దారుల మహాసభకు పిలుపు

**దుబ్బాక, సెప్టెంబర్ 3 ( సిద్దిపేట పవర్):** రామలింగారెడ్డి కాలనీలో వికలాంగులు, చేయూత పెన్షన్ దారుల సమావేశం జరిగింది. ఈనెల 5న దుబ్బాక కేంద్రంలో నిర్వహించనున్న మహాసభకు వేలాదిగా తరలిరావాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ నేత, సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ మాదిగ, VHPS ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ దండు శంకర్, MSF జిల్లా అధ్యక్షుడు సామ్రాట్ ప్రకాష్ పాల్గొని మాట్లాడారు. వారు పేర్కొంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు వికలాంగుల పెన్షన్‌ను ₹ 6,000కి పెంచారని, అయితే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో వికలాంగులకు ₹ 6,000, మిగతా చేయూత పెన్షన్ దారులకు ₹ 4,000 ఇస్తానని హామీ ఇచ్చి, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా పెంచలేదని విమర్శించారు. ఇది వికలాంగులు, వృద్ధులు, వితంతువులపై ఘోర మోసం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు కూడా ఈ అంశంపై నోరుమూయడం తీరని అన్యాయమని అన్నారు.



ఈనెల 5న జరిగే మహాసభకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అందువల్ల వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, నేత-చేనేత కార్మికులు అందరూ వేలాదిగా హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మహమ్మద్ అబ్బర్, గౌంతు లక్ష్మి, రాగుల దుర్గమ్మ, వీరభద్ర, వెంకట మల్లేశం, వీరబత్తిని శోభ, భోగ సత్యనారాయణ, జంగిటి మల్లేశం, జంగిటి శోభ, వీరబత్తిని అంబవ్వ, ఎర్రాల మరెన్న, మేడ సుజా, వామిడాల లక్ష్మి, ధర్మాజీ మల్లేశం, దొంతు బాలాలష్మి, లక్ష్మణ్, గుండా బాలాజీ శ్రీరామ్ పద్మ, మంజుల, దంచు వజ్రవ్ తదితరులు పాల్గొన్నారు

# భారతదేశ విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క ఏఐఎస్ఎఫ్

- **విద్యరంగ సమస్యల పరిష్కారమే ఏఐఎస్ఎఫ్ ధ్యేయం**
- **మంద పవన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు**
- **చేర్యాలలో ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ వారోత్సవాల ముగింపు**

**చేర్యాల, సెప్టెంబర్ 3 (సిద్ధిపేట పవర్)** భారతదేశ విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క, విద్యార్థి లోకానికి దిక్సూచి, పోరాటాలే ఊపిరిగా,విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం విద్యార్థుల పక్షాన నిలబడుతున్న ఏకైక సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) మాత్రమేనని ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు మంద పవన్ అన్నారు... బుధవారం రోజున ఏఐఎస్ఎఫ్ 90వ వారోత్సవాల ముగింపు సభ సందర్భంగా చేర్యాల మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ సిద్ధిపేట జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పాత బస్టాండ్ నుంచి పీఎంఆర్ గార్డెన్ వరకు భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు.. అనంతరం పిఎంఆర్ గార్డెన్ లో ఏఐఎస్ఎఫ్ శ్వేతారణ పతాకాన్ని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు మంద పవన్ ఆవిష్కరించి సభను ప్రారంభించారు.





# గజ్వేల్ విద్యానగర్ కాలనీలో అన్నదాన కార్యక్రమం

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం:** గజ్వేల్ నియోజకవర్గం గజ్వేల్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలో గత 11 సంవత్సరాల నుండి వినాయకుని భక్త శ్రద్ధలతో పూజిస్తున్నామని విద్యానగర్ కాలనీ వినాయక భక్త బృందం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలో గత 11 సంవత్సరాల నుండి ఆ గణనాథుని నవరాత్రుల్లో భక్తిశ్రద్ధలతో పూజించడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా గజ్వేల్ పట్టడానికి వచ్చే భక్తులకు ఉదయం అన్న ప్రసాదం సాయంత్రం అల్పాహారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గజ్వేల్ లో మొట్ట మొదటిసారిగా అన్న ప్రసాదం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. గజ్వేల్ పట్టణంలో సుమారుగా వెయ్యి మందికి పైగా భక్తులకు అన్నప్రసాదం బోధించడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా గణపతి మండపంలో కుంకుమార్చన గరిక పూజ ఆచార్య కార్యక్రమాల్లో భాగంగా దేశం మన పట్టణం మన గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ భక్తులందరూ అష్ట ఆయురారోగ్యాలతో ఉండాలని సద్ది బుద్ధి జ్ఞానం పెంపొందించాలని భక్తులందరికీ భక్తులు చాలా సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాడి పల్లి విజయ్ కుమార్ బచ్చు రవి ఎలకాందుల నవీన్ అమర నాగేందర్ రామచందర్ ప్రభాకర్ జగ్గయ్య గారి శ్రీ శ్రీహరి గాడి పల్లి జై డి కిరణ్ కుమార్ కె రాజు ఎయిర్టెల్ ప్రవీణ్ మధు శ్రీరామ్ బాల నర్సయ్య రాజారాం ఆంజనేయులు చారి రవి టి ప్రభాకర్ ఐవానంద్ గోగి కార్ తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తం ఉండాలి

**సిద్దిపేట పవర్:** జిల్లా కలెక్టర్ మరియు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బిజ్జూరి రవికుమార్ ఆదేశాల మేరకు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు అయినా పూర్ గ్రామంలో సీజనల్ వ్యాధులపై విష జ్వరాలపై అప్రమత్తం ఉండాలని కళా ప్రదర్శన నిర్వహించారు ఈ సందర్భంగా సారధి కవి గాయకుడు పిన్నింటి రత్నం కళాకారుల టీం లీడర్ పిల్లిట్ల శ్యామ్ సుందర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి ఒక్కరు పాటించాలని విష జ్వరాలు అనగా డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ చికున్ గున్యా లాంటి ప్రాణాంతక వ్యాధులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఈగలు దోమలు ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ప్రతి ఇంట్లో నీటి నిల్వలు ఉండకుండా డ్రైడేగ పాటించాలని మనమందరం పరిశుభ్రత గ్రామంగా తీర్చిదిద్దాలని తన పాటలతో మాటలతో ప్రజలను చైతన్య పరిచారు, ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మడికొండ బాల్ నరసయ్య సారధి కళాకారులు సనువాల కనకయ్య, గెంటే హరిప్రసాద్, పన్నీరు శ్రీనివాస్, తండా బిక్షపతి,ఎల్లా సిద్ధులు, రాచపల్లి శైలజ,తదితరులు పాల్గొన్నారు,



# సెప్టెంబర్ 5న దుబ్బాకలో వికలాంగుల మహాగర్జన

**దుబ్బాక, సెప్టెంబర్ 3 ( సిద్దిపేట పవర్) :** దుబ్బాక నియోజకవర్గ కేంద్రంలో సెప్టెంబర్ 5న జరగనున్న వికలాంగుల, చేయూత పెన్షన్ దారుల "వికలాంగుల మహాగర్జన" విజయవంతం కావాలని నేతలు పిలుపునిచ్చారు. బుధవారం గంభీరపూర్ గ్రామంలో వికలాంగుల సన్నాహక సమావేశం జరిగింది. జింక దేవదాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెర్పీఎస్ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, వీహెచ్పీఎస్ కోఆర్డినేటర్ దండు శంకర్, సామ్రాట్ ప్రకాష్ మాదిగ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.నేతలు మాట్లాడుతూ— "ఎన్నికల సమయంలో ఓటు వేయండి, వచ్చే నెల పెన్షన్ తీసుకోండి అన్నారు. కానీ ఇప్పుడు 20 నెలలు గడిచినా హామీలు నెరవేర్చలేదు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ హామీలు గుర్తు చేస్తూ వికలాంగులకు ₹ 6,000 పెన్షన్ వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత, నేత చేయూతపెన్షన్ దారులకు ₹ 4,000 పూర్తి అంగవైకల్యం ఉన్న వారికి ₹ 15,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ నెల 5న దుబ్బాకలోని కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద జరిగే మహాగర్జన సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మహిళా వికలాంగుల నాయకురాలు కండ్లకోయ దేవలక్ష్మి, మాడుగుల యశోద, చేపూరి నరసింహ గౌడ్, జింక కనకయ్య, చేపూరి సురేందర్ గౌడ్, గురువారెడ్డి, బత్తిని నరసింహులు, జింక లక్ష్మణ్, గట్టు నాగరాజు, కైరం కొండ లక్ష్మి, బిచ్చగారి అశోక్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు





# శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాలు

**ఘనంగా 8 రోజు గణపతి నవరాత్రి ఉత్సవాలు**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం:** గజ్వేల్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ గణపతి మండపంలో నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగ నిర్వహిస్తున్నారు బుధవారం 8వ రోజుకు చేరుకున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు, గణపతి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అరటాకులో మహా అన్నప్రసాదం అందజేశారు.ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్, ఆర్యవైశ్య మహాసభ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆదిదేవుడు గణపతి అనుగ్రహంతో అందరూ బాగుండాలని, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయం వద్ద గత కొన్ని సంవత్సరాలుగా భారీ గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆరోగ్యమే మహాభాగ్యం అనే లక్ష్యంతో, ప్లాస్టిక్ ప్లేట్స్ వాడకుండా స్టీల్ ప్లేట్లలో అరిటాకు ఏర్పాటుచేసి, వాటర్ కూడా స్టీల్ గ్లాసులలో అందజేస్తూ, ఆరోగ్యంపై శ్రద్ధ కల్పించే విధంగా, ఒక బృహత్తర కార్యక్రమం వినాయక కమిటీ తీసుకోవడం జరిగిందని ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని సూచించారు, గణపతి నవరాత్రి ఉత్సవాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి దేవదేవతల ఆశీర్వాదం ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు రాజారాం, గణపతి విగ్రహ దాత వంగ మోహన్, నాయకులు ఏడేల్లి శ్రీనివాస్,ఆదిమూలం రవి, నాగేష్,వెంకటరెడ్డి, అత్తెల్లి రవి, కొమురవెల్లి రమేష్, కమిటీ సభ్యులు,మహిళలు, చిన్నారులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

# అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న

**ఆకునూరు లో మహదేవ్ యూత్ అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం**

**చేర్యాల, సెప్టెంబర్ 3 (సిద్దిపేట పవర్)** ఆకునూరు లో మహదేవ్ యూత్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈరోజు అన్నదానం చేశారు..అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అనే నానుడితో వారు ఈ కార్యక్రమానికి పూనుకున్నారు..ఈ అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాత సాయి కిరణ్ నాయక్ కి వారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు..ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా స్వామి వారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని, నాకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు అని తెలిపారు.. కార్యక్రమంలో యూత్ సభ్యులు విక్రమ్, బాలాజీ, అరవింద్, ధనుష్, అనూష్, మహేష్, అజయ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు



# కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- **కవిత మాట్లాడిన తీరు కార్యకర్తలను బాధించింది**
- **బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దాచరం కనకయ్య**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం** :జగదేవపూర్ గత కొద్ది రోజులుగా బి అర్ ఎస్ పార్టీ లోని నాయకులను కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తూ పార్టీకి నష్టం జరుగుతుందని గుర్తించి బీఆర్ఎస్ నుంచి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేస్తూ పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని జగదేవపూర్ మండల బి అర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ దాచరం కనకయ్య అన్నారు.బుధవారం మండల కేంద్రములో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొంతకాలంగా కవిత పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అందుకే సస్పెండ్ చేశారని అయన తెలిపారు. పార్టీలో ఎంత పెద్ద వారైనా క్రమశిక్షణకు లోబడి పని చేయాల్సిందే అని పేర్కొన్నారు. తప్పు చేస్తే కూతురు అయినా, కొడుకు అయినా సహించేది లేదని గతంలో కేసీఆర్ స్పష్టం చేశారని గుర్తుచేశారు.కన్న కూతురు కంటే కూడా కష్టంలో పార్టీకి అండగా ఉన్న కార్యకర్తల భవిష్యత్తు ముఖ్యమని తీసుకున్న నిర్ణయం చర్చించదగ్గ విషయం. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణం త్యాగానికి సిద్ధపడ్డారు.ఈ రోజు పార్టీ కోసం కన్న బిడ్డను కూడా వదులుకున్న గొప్ప నాయకులు కేసీఆర్ అని కొనియాడారు.



# రామక్కపేటలో అన్నదాన కార్యక్రమం

**దుబ్బాక, సెప్టెంబర్ 3 (సిద్దిపేట పవర్)** :సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రామక్కపేట గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఛత్రపతి యూత్ ఆధ్వర్యంలో ఈరోజు గ్రామంలోని వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు.



# మేడి గడ్డ ముందా... కాళేశ్వరం ముందా...!

- కాళేశ్వరం ప్రాజెక్టులో బిఆర్ఎస్ పార్టీ కుంభకోణం
- ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ధ్వజం
- ఎమ్మెల్యే తన వైఖరిని మార్చుకోవాలి
- దుబ్బాక కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు నర్మెట ఏసురెడ్డి డిమాండ్

**సిద్దిపేట పవర్ , దుబ్బాక, సెప్టెంబర్ 03:** ఇంకా రైతులను , అటు ప్రజలను మోసం చేస్తూ కాలం వెళ్లదీయాలని చూస్తున్న బిఆర్ఎస్ పార్టీని పూర్తిస్థాయిలో ప్రజలు బుద్ధి చెప్తారని దుబ్బాక కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు నర్మెట ఏసు రెడ్డి అన్నారు. బుధవారం రోజున వారు మాట్లాడుతూ... దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తిరు ఇంకా మారలేదని , ఇంకా మతిభ్రమించిన మాటలే మాట్లాడుతున్నాడని వారు మండిపడ్డారు. నేడు కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతులకు సాగునీరు అందిస్తున్నామని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ముందు మేడిగడ్డ ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందిందని గుర్తుంచుకోవాలన్నారు. కేవలం రైతులను మోసం చేసి లక్షల కోట్లు దండుకోవాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిందన్నారు. ఇప్పటికైనా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తను మాట్లాడిన మాటలను ఒకసారి గుర్తు తెచ్చుకోవాలన్నారు. లక్షల కోట్లు వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టితే రెండు సంవత్సరాలు లోపే పిల్లర్లు కుంగిపోవడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వారు హెచ్చరించారు.



## వినాయకుడికి ఘనంగా దీపారాధన

**సిద్ధిపేట :** సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జిల్లా కేంద్రం సిద్దిపేట పట్టణం టెలికం నగర్ కాలనీ లో ఏర్పాటుచేసిన వినాయకుడి మండపం వద్ద మానస, ప్రవళిక, ప్రవళిక వినాయకుడి ప్రతిమతో ముగ్గులు వేసి దీపాలను అలంకరించారు. పూజల అనంతరం దీపారాధన కార్యక్రమం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా పలు రకాల పిండివంటలతో మహా నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో కాలనీవాసులు మానస, ప్రవళిక, ప్రవళిక, మహిళలు, చిన్నారులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**సిద్దిపేట పవర్, దుబ్బాక, సెప్టెంబర్ 03:** పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట వార్డులో చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వార్డుకు చెందిన బూర మల్లేశం (61) అనే వ్యక్తి మంగళవారం గూగుల్ తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.



## భార్యను వేధించిన భర్తకు మూడేళ్ళ జైలు

**రూ.10 వేల జరిమానా**

**సిద్దిపేట పవర్, సిద్దిపేట అర్బన్:** భార్యను వేధించిన భర్తకు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 10,000 జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెల్లడించినట్లు ముస్తాబాద్ ఎస్.ఐ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన సదిమెల రామచంద్రం తన భార్య కనకవ్వను తరచూ మానసికంగా, శారీరకంగా వేధించేవాడని తెలిపారు. మద్యం సేవించి గొడవలు పెట్టడంతో పాటు 2016 డిసెంబర్ 2న ఉదయం 6 గంటల సమయంలో భార్యను దారుణంగా కొట్టాడని, టార్చ్‌లైట్‌తో దాడి చేసి గాయాలు చేశాడని తెలిపారు.వేధింపులు భరించలేక బాధితురాలు ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు నిందితుడు సదిమెల రామచంద్రం పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. అనంతరం అప్పటి ఎస్.ఐలు చిట్టిబాబు, ప్రవీణ్ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ వాదించగా, ఎస్.ఐ గణేష్, సీఎంఎస్ ఎస్.ఐ శ్రవణ్, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ తో పాటు 12 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.నిందితుడు రామచంద్రం పై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి ప్రవీణ్ మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించినట్లు ముస్తాబాద్ ఎస్.ఐ గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

## వినాయకుని ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

**-కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గుప్తా**

**కౌడిపల్లి సిద్దిపేట పవర్ ప్రతినిధి:** మండల కేంద్రమైన పి ఎస్ జి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద మంగళవారం రాత్రి కాంగ్రెస్ యువ నాయకులు కౌడ శ్రీనివాస్ గుప్తా , ఆర్ఎంపీ డాక్టర్ రవి అన్నసంతర్పణ నిర్వహించారు తొమ్మిది రోజులపాటు వినాయకుని వద్ద నియమనిష్టలతో పూజలందుకున్న వినాయకుని వద్ద భక్తుల రద్దీ నెలకొంది. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేసి భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ వినాయకుని కృపా కటాక్షంతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు సతీష్, శేఖర్, ప్రవీణ్, రాజు, ధన్ రుత్ ఉన్నారు



## కాళేశ్వరంపై కాంగ్రెస్‌ది అసత్య ప్రచారం

**సంగారెడ్డి టౌన్ సిద్దిపేట పవర్ ప్రతినిధి:** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోందని భారాస ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కొత్త బస్టాండ్ వద్ద నల్ల కండువాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే, భారాస జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో రెండు పిల్లర్లు కుంగాయని, వాటికి మరమ్మతులు చేస్తే కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్న కారణంతో పట్టించుకోవడంలేదన్నారు. కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలన్న కుట్రలో భాగంగానే సీబీఐకి అప్పగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీబీ ఉపాధ్యక్షులు మాణిక్యం, సీడీసీ మాజీ అధ్యక్షులు బుచ్చిరెడ్డి, టీఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రాజేందర్, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు నరహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ ద్వారా నిరుపేదలకు లబ్ధి

**నూనె కుమార్ యాదవ్**

**కొండపాక,సెప్టెంబర్,3(సిద్ధిపేట పవర్)** సీఎంఆర్ఎఫ్ ద్వారా నిరుపేద కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని బిఆర్ఎస్ పార్టీ కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్ అన్నారు.కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో బిఆర్ఎస్ యువజన విభాగం మాజీ అధ్యక్షులు గోనే శ్రీనివాస్ తో కలిసి బిఆర్ఎస్ పార్టీ కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్ సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులైన దుద్దెడ గ్రామానికి చెందిన గజ్వేల్ అరుణ భర్త మల్లేశం కు 25000 సీఎంఆర్ఎఫ్ చెక్కు బుధవారం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎంఆర్ఎఫ్ నిరుపేద కుటుంబాల్లో ఒక వరం లాగా పని చేస్తుందని దీన్ని నిరుపేద మధ్యతరగతి కుటుంబాల వారు ఉపయోగించుకోవాలని సూచించారు.ఏదైనా అనారోగ్య బారిన పడి ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నట్లయితే డిశ్చార్జ్ అయిన తర్వాత ఈ పథకానికి దరఖాస్తు చేసుకుంటే కొంత ఆర్థిక సహాయంగా ఉపయోగపడుతుందని అన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతనే తెలంగాణ ప్రజలకు ఈ సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ధి జరుగుతుందని అన్నారు.సీఎంఆర్ఎఫ్ ద్వారా నిధులు మంజూరు కావడానికి కృషి చేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ మాజీ మంత్రి హరీష్‌రావు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి బిఆర్ఎస్ గజ్వేల్ ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు చిక్కుడు భాను, ఎస్టీ సెల్ అధ్యక్షులు కెమ్మసారం శ్యామ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గుర్రాల కనకయ్య యాదవ్, గాదగోని రాకేష్ గౌడ్, మెరుగు శివకుమార్, భూనాద్రి రంజిత్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ జాగ్రత్త దినోత్సవం జరిపారు

**సిద్దిపేట పవర్ కొమురవెల్లి సెప్టెంబర్ 03** సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం కేంద్రంలో బుధవారం నాడు కొమురవెల్లి ఎస్ఐ రాజు వారి సిబ్బంది సైబర్ జాగృత దినోత్సవం లో భాగంగా కేజీబీవీ స్కూల్ కొమురవెల్లి నందు సైబర్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించి విద్యార్థులకు సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫేక్ ప్రొఫైల్ మోసాలు, ఆర్టీఏ ఈ చలాన్ మోసాలు, వంటి పలు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్కూల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.




## యువతి ఆత్మహత్య

**కౌడిపల్లి సిద్దిపేట పవర్ ప్రతినిధి:** తల్లిదండ్రులు తరచూ సంసార విషయంలో గొడవలు పడుతుండటంతో జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో బుధవారం జరిగింది ఎస్ఐ రంజిత్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని మహమ్మద్ నగర్ గ్రామానికి చెందిన బండల మైసయ్య అతని భార్య శమంత తరచూ గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో ఈనెల 2న (మంగళవారం) సాయంత్రం ఇంటి బయట తల్లిదండ్రులు గొడవ పడుతుండగా వారి కూతురు బండల అక్షిత(21) అక్కడికి వెళ్లి మీరు ఎందుకు గొడవ పడుతున్నారు అని అడిగి క్షణికావేశంలో ఇంట్లోకి వెళ్లి తన చున్నితో ఇంట్లో దూలానికి ఉరి వేసుకుంది. తల్లిదండ్రులు ఇంట్లో వచ్చి చూసేసరికి కూతురు అక్షిత ఉరి వేసుకొని ఉంది. కొన ఊపిరితో ఉన్న అక్షితను వారు కిందికి దింపారు. కొద్దిసేపటికి అక్షిత ఇంట్లోనే మరణించింది. మృతురాలి తండ్రి బండల మైసయ్య బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోస్టుమార్టం నిమిత్తం అక్షిత మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ రంజిత్ కుమార్ రెడ్డి తెలిపారు.





## మహిళలకు ఉన్న చట్టాల గురించి రక్షణ అవగాహన

**మహిళలకు,మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, సైబర్ నేరాల గురించి, , సామాజిక రుగ్మతల గురించి, అవగాహన కల్పించిన చేర్యాల ఎస్ఐ నవీన్, హుస్నాబాద్ షీటీమ్ బృందం**

**సిద్దిపేట పవర్ చేర్యాల సెప్టెంబర్03** చేర్యాల పట్టణంలో అంగడి బజార్లో వ్యాపారస్తులకు మహిళలకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి వాట్సప్ కు వచ్చే ఎలాంటి లింకులు ఓపెన్ చేయవద్దు ఎవరైనా బ్యాంకు అధికారులని మాట్లాడితే బ్యాంకు ఎకౌంటు డీటెయిల్స్ ఎవరికీ తెలుపవద్దు చాలా జాగ్రత్తగా ఉండాలి అనుకోకుండా ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 ఫిర్యాదు చెయ్యాలి జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గురించి ఏదైనా సంఘటన జరిగితే మహిళలు మౌనం వీడి పోలీసులకు తెలియపరచాలి మహిళల రక్షణకు పెద్దపీట వేశారు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.అపరిచితుల వ్యక్తుల మాటలు నమ్మవద్దు ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అమాయక ప్రజలను చూసి ఇది ఇస్తాము అది ఇస్తాము కొన్ని డబ్బులు పెడితే ఎక్కువ డబ్బులు వస్తాయి అని మోసం చేసేవారు ఉంటారు జాగ్రత్తగా ఉండాలి ప్రజలకు మహిళలకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీటీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాల గురించి, ర్యాగింగ్/ ఇవిటీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు,నూతన చట్టాల గురించి, అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ మాటలు నమ్మవద్దు, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుంది మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. స్కూల్ వెళ్లే పిల్లల ప్రవర్తన గమనిస్తూ ఉండాలని సూచించారు, సామాజిక రుగ్మతల గురించి సెల్ఫోన్ కు ఎంత దూరం ఉంటే అంత మంచిది సెల్ ఫోన్ వల్ల ఎంత మంచి ఉందో అంత చెడు ఉంది దానికి అలవాటు పడి బానిసలు కావద్దు సూచించారు. మహిళలు వ్యవసాయ పనులపై ఒంటరిగా వెళ్లేటప్పుడు వంటిపై బంగారం ఉంటే దొంగతనం జరిగే అవకాశం ఉంటుంది జాగ్రత్త పడాలి మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే అవహేళనగా మాట్లాడిన వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షీటీమ్ నెంబర్ 8712667434 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ షీటీమ్ బృందం ఏఎస్ఐ సదయ్య, మహిళ కానిస్టేబుళ్లు ప్రశాంతి, స్వప్న, కానిస్టేబుల్ కృష్ణ, వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

## అక్కెనపల్లిలో క్షుద్ర పూజలు భయాందోళనలతో కాలనీవాసులు

**సిద్దిపేట పవర్ నంగునూర్ సెప్టెంబర్ 03:** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామంలో డబుల్ బెడ్ రూంల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు నిమ్మకాయలు, కుంకుమతో క్షుద్ర పూజలు నిర్వహించడం కలకలం రేపాయి. దీంతో డబుల్ బెడ్ రూమ్ కాలనీ వాసులతో పాటు గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. అక్కెనపల్లి గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో మూడు రోడ్లు కలిసే చోట కుంకుమ, పసుపు, నిమ్మకాయలతో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు ఉండడంతో గ్రామస్తులు భయాందోళనల చెందుతున్నారు. అయితే అర్థరాత్రి సమయంలో ఈ క్షుద్ర పూజలు చేస్తున్న వ్యక్తులను అక్కడే పక్కనే వినాయక మండపంలో నిద్రిస్తున్న కొందరు యువకులు మేలుకొని వీడియోలు తీశారు. అది గమనించిన క్షుద్రపూజలు చేస్తున్న వ్యక్తులు వీడియో తీస్తున్న యువకుల పై రాళ్లను, కట్టెలను విసిరి అక్కడి నుండి పరిగెత్తి వెళ్లిపోయినట్లు యువకులు చెబుతున్నారు.





# విటమిన్ 'డి' లోపం.. ఇవే అనారోగ్య సమస్యలు

మనిషి శరీరానికి విటమిన్ విటమిన్ 'డి' చాలా అవసరం. ఇది లోపించడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. శారీరక సమస్యలు, మానసిక సమస్యలు కూడా వస్తాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. విటమిన్ లోపం వల్ల డిప్రెషన్ కు లోనవుతారని దాని నుంచి బయటపడేందుకు కొన్ని జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు.

డిప్రెషన్ అనేది ఒక సాధారణ సమస్య. దీనికి చాలా కారణాలు ఉండొచ్చు. విటమిన్ డిని సన్‌షైన్ విటమిన్ అని కూడా పిలుస్తారు, ఇది మన శరీరంలో అనేక ముఖ్యమైన విధులను నిర్వహిస్తుంది. ఇది ఎముకలను దృఢంగా ఉంచుతుంది. రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. మానసిక స్థితిని నియంత్రిస్తుంది. కాబట్టి శరీరానికి చాలా ముఖ్యమైనదిగా పరిగణిస్తారు.

ఎండలో తక్కువ సమయం గడపడం వల్ల విటమిన్ డి లోపం ఏర్పడుతుంది. శరీరంలో ఎముకలు బలహీనపడటం, జుట్టు రాలడం మొదలైన అనేక సమస్యలు వస్తాయి. దీంతో పాటు డిప్రెషన్ కు లోనవుతారు.

విటమిన్ డి మెదడులో సెరోటోనిన్ స్థాయిలను పెంచడానికి సహాయపడుతుంది, ఇది మానసిక స్థితిని నియంత్రించే న్యూరోట్రాన్స్మిటర్. విటమిన్ డి స్థాయిలు తక్కువగా ఉన్నప్పుడు, సెరోటోనిన్ స్థాయిలు కూడా తగ్గుతాయి. తద్వారా డిప్రెషన్ వస్తుంది. విటమిన్ డి లోపం ఆందోళన, బైపోలార్ డిజార్డర్ , ఇతర మానసిక ఆరోగ్య సమస్యలతో కూడా ముడిపడి ఉంటుంది. కాబట్టి రోజు కనీసం ఒక గంట పాటు ఎండలో తిరగాలని, సూర్య కిరణాలు తాకేలా చూసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ప్రకృతి సిద్ధంగా దొరికే డి విటమిన్ ను కూడా ఆస్వాదించలేకపోతున్నారని ఇది చాలా ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.







# నూడుల్స్ తింటున్నారా.. అయితే జాగ్రత్త



ఇన్‌స్టంట్ నూడుల్స్‌లో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు తక్కువగా ఉంటాయి. సోడియం ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తపోటు పెంచడమే కాకుండా గుండె సంబంధిత వ్యాధులకు కారణమవుతుంటాయి. ఈ ఇన్ స్టంట్ న్యూడుల్ అధిక కొవ్వు ఉత్పత్తి అవుతుంది. దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. అయితే కొన్ని నూడల్స్ బ్రాండ్ లలో ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపేవి ఉంటాయి. ముఖ్యంగా దీనివల్ల రక్తంలో చక్కెర పెరుగుదల ప్రారంభం అవుతుంది. అధిక బరువు సమస్యలు తలెత్తవచ్చు. పోషక విలువలు అందకుండా పోతాయి.

విటమిన్స్ , మినరల్స్, ఫైబర్ లోపం తలెత్తి, శరీరం బలహీనంగా మారిపోతుంటుంది. అందుకే నూడుల్స్ ను ఎక్కవగా కాకుండా తక్కువ తినాలని పిల్లలకు దూరంగా ఉంచాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# కాలేయ వ్యాధి లక్షణాలు ఇవే..

మానవ శరీరంలో కాలేయం ఆరోగ్యం చాలా ముఖ్యం. మన జీవనశైలిలో కాలేయం ఆరోగ్యంగా ఉంటే చాలా వరకు ఇబ్బందులు తలెత్తవు. కాలేయం ఆరోగ్యం కోసం సిగరెట్, మద్యానికి దూరంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అధిక కొవ్వు, చక్కెర, ప్రాసెస్డ్ ఫుడ్స్ తినడం వల్ల కాలేయం దెబ్బతింటుంది. వీటికి ఎక్కువగా దూరంగా ఉండాలని చెబుతున్నారు.

హెపటైటిస్ ఏబీసీడీఈ లాంటి వైరస్ ల వల్ల కాలేయం చెడిపోతుంది. నాన్‌ఆల్కహలిక్ ఫ్యాటీ లివర్ ఆల్కహలిక్ ఫ్యాటీ లివర్ కాలేయం లో కొవ్వు మోతాదుపెరిగి దాని పనితీరు క్షీణిస్తుంది.
రక్తంలో చక్కెర స్థాయి అధికంగా ఉండడం వలన కాలేయం మీద ఒత్తిడి పెరుగుతుంది, దీని ఫలితంగా కాలేయం దెబ్బతింటుంది. కొంత మందికి కాలేయ వ్యాధులు వారసత్వం కింద వస్తుంటాయి.
కాలేయం పై రసాయనాలు, మందులు ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. అధిక బరువుతో కూడా కొన్ని సార్లు లివర్ డ్యామేజీకి కారణం అవతుంటుంది.

కాలేయ వ్యాధికి కారణమయ్యే లక్షణాలు ఇలా ఉంటాయి. దురద చర్మం, వికారం లేదా వాంతులు, మలం రంగులో మార్పు, కడుపు నొప్పి, వాపు, మూత్రం రంగులో మార్పు, చర్మం, కళ్ళు పసుపు రంగులోకి మారడం లాంటి లక్షణాలు కనిపిస్తుంటాయి

